సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
ఆదివారం । 15 । సెప్టెంబర్ । 2024



...సత్తా చాటుతాం

బరువులెత్తుతాం.. సత్తా చాటుతాం అంటూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పవర్ లిఫ్టర్లు పోటాపోటీగా తలపడ్డారు. ఈ పోటీలకు అమలాపురం వేదికైంది. 8లో



సంస్కృతికి వేదాలు పట్టుగొమ్మలు

భారతీయ సంస్కృతీ సంప్రదాయాలకు, ధర్మాలకు వేదాలు పట్టు కొమ్మలుగా నిలుస్తున్నాయని తెనాలి, రాజమహేంద్రవరం, టీటీడీ వేదిక్ వర్సిటీ వేదపండితులు తెలిపారు. 8లో

ఒక్క మాత్రతో నులిమేద్దాం..



నులి పురుగు.. ఈ మాట వినడానికి చిన్నగానే ఉన్నా మనిషికి కలిగించే అనారోగ్యం పెద్దదే. చిన్నారుల్లో రక్తహీనతకు, రోగాలకు కారణమవుతున్న నులి పురుగుల నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా రెండు సార్లు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తున్నాయి. 8లో

న్యూస్‌రీల్

పీహెచ్‌సీల్లో ఓపీ సేవలు బంద్

జిల్లాలో వైద్యుల నిరసన

అమలాపురం టౌన్: రాష్ట్ర ప్రభుత్వం పీజీ విద్యలో ఇన్ సర్వీస్ కోటాను కుదించడాన్ని నిరసిస్తూ జిల్లాలోని 48 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో (పీహెచ్‌సీ) వైద్యులంతా ఓపీ సేవలకు శనివారం దూరంగా ఉన్నారు. కేవలం అత్యవసర కేసులు వస్తే వాటికి మాత్రమే సేవలు అందించారు. జిల్లా పీహెచ్‌సీల డాక్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ ఫణికిరణ్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ టి.మణికుమార్ ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమం జరిగింది. సర్వీస్ కోటాను కుదిస్తూ విడుదలైన జీవో 85ని తక్షణమే రద్దు చేయాలని నినాదాలు చేశారు. జిల్లా పీహెచ్‌సీ డాక్టర్ల అసోసియేషన్‌కు చెందిన కొందరు డాక్టర్లు విజయవాడలో ఉండి ఈ జీవో రద్దుకు రాష్ట్ర అసోసియేషన్ నిర్వహిస్తున్న చర్చల్లో పాల్గొన్నారు. మిగిలిన వైద్యులు ఆయా పీహెచ్‌సీల్లోనే ఉండి నిరసన తెలిపారు. దీనిని ఉధృతం చేసి మొత్తానికి విధులు బహిష్కరించి ఓపీ, ఎమర్జెన్సీ కేసులను కూడా చూడమని అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మణికుమార్ స్పష్టం చేశారు.

రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు

అమలాపురం రూరల్: మిలాద్ ఉన్ నబీ పండగ, సెలవు దినం సందర్భంగా ఈ నెల 16వ తేదీ సోమవారం అమలాపురం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను రద్దు చేశారు. ఈ విషయాన్ని కలెక్టర్ కార్యాలయం శనివారం ఓ ప్రకటనలో పేర్కొంది. దీనిని అర్జీదారులు గమనించాలని కోరింది.

విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు



అయినవిల్లి విఘ్నేశ్వరునికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వర స్వామివారి ఆలయంలో వినాయక నవరాత్ర వేడుకల్లో భాగంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి ఆలయ ప్రధానార్చకుడు సూర్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో లఘున్యాస ఏకాదశ రుద్రాభిషేకాలు, లక్షగరిక పూజ, శ్రీలక్ష్మీ గణపతి హోమం, పంచహారతులు ఇచ్చారు. స్వామిని మాఢవీధుల్లో మూషిక వాహనంపై ఊరేగించారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆలయంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. అన్నదాన ట్రస్టుకు తొత్తరమూడికి చెందిన అమర సత్యనారాయణ మూర్తి రూ.1,16,116 విరాళంగా సమర్పించారు.

చిరుత కోసం రేయింబవళ్లు గాలింపు



అటవీ శాఖ అధికారి భరణి

రాజానగరం: చిరుతపులి కెమెరాలకు చిక్కకుండా, బోనులకు అందకుండా తిరుగుతోందని జిల్లా అటవీశాఖ అధికారి ఎస్.భరణి తెలిపారు. లాలాచెరువు హౌసింగ్ బోర్డు కాలనీ, పుష్కర వనాల మధ్య చిరుత సంచరిస్తున్న సంగతి తెలిసిన తరువాత తొమ్మిది రోజులుగా శాఖాపరంగా చేపట్టిన చర్యలను ఆమె వివరించారు. అటవీ ప్రాంతంలో కొన్ని కెమెరాలను ఏర్పాటు చేయడంతో పాటు క్రూరమైన జంతువులను పట్టుకోవడంలో నిపుణులైన వారితో బృందాలుగా దానిని గాలిస్తున్నామన్నారు. వీటితో పాటు థర్మల్ డ్రోన్ కెమెరా కూడ ఉపయోగించి శోధిస్తున్నామన్నారు. కొన్నిచోట్ల కెమెరాలలో కనిపించిన దృశ్యాల ఆధారంగా అది దివాన్‌చెరువు రిజర్వ్ ఫారెస్టులోనే ఉందని, దాని పాద ముద్రలు కూడా గుర్తించామని అన్నారు. అయితే ఇంత వరకూ దాని వల్ల ఎటువంటి ప్రాణనష్టం జరగలేదన్నారు. అలాగే పులి సంచారంపై జరుగుతున్న అసత్య ప్రచారాలను నమ్మవద్దని ఆమె సూచించారు.

20న 'నన్నయ'లో జాతీయ యువజనోత్సవాలు

రాజానగరం: స్వామి వివేకానంద జయంతి సందర్భంగా నన్నయ వర్సిటీలో కాకినాడలోని యువజన సర్వీసుల శాఖ, సెట్రాజ్ ఆధ్వర్యంలో 20న జాతీయ యువజనోత్సవాలు నిర్వహించనున్నట్టు సెట్రాజ్ సీఈఓ కేఎస్‌వీ కాశీ విశ్వేశ్వర్రావు తెలిపారు. 15 నుంచి 29 మధ్య వయసున్న యువతకు 'సైన్స్ అండ్ టెక్నాలజీలో ఆవిష్కరణ' నేపథ్య పోటీలు, సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం పొందిన విజేతలను రాష్ట్ర స్థాయికి, రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం పొందిన వారిని జాతీయ స్థాయి పోటీలకు పంపిస్తారన్నారు. ఆసక్తి గలవారు కాకినాడలోని సెట్రాజ్ కార్యాలయాన్ని 89191 35344, 98853 53033, 98499 13065 నంబర్లలో సంప్రదించి, రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

ఎంత కష్టం.. నష్టం

- ఈ ఏడాది మూడో సారి వరద
- మంచినీరు, ఆహార ప్యాకెట్లతో సరి
- ఇళ్లు మునిగితేనే పరిహారం అంటున్న ప్రభుత్వం
- మత్స్యకారులు ఉపాధికి దూరం
- ఇంకా ముంపులోనే ఉద్యాన పంటలు



ముమ్మిడివరం మండలం గురజాపులంకలో చనిపోయిన కొబ్బరి మొక్కలు



బోడసకుర్రు పల్లిపాలెంలో నీట మునిగిన మత్స్యకార కాలనీ



గురజాపులంకలో దెబ్బతిన్న బెండ తోట

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

సాక్షి, అమలాపురం: గోదావరికి వరద వచ్చింది.. ఈ ఏట మూడుసార్లు పోటెత్తింది. జిల్లాలోని లంక గ్రామాలను ముంచెత్తింది. వారి జీవనాన్ని అతలాకుతలం చేసింది. విద్యార్థులు, మహిళలు, వృద్ధులు అనే తేడా లేకుండా రైతులు, మత్స్యకారులు అనే బేధం లేకుండా ప్రతి ఒక్కరినీ ఇబ్బందుల పాల్జేసింది. మూడుసార్లు వరద వచ్చి రెండు దఫాలుగా ఇరవై రోజులకు పైగా గ్రామాలు.. ఇళ్లు జల దిగ్బంధంలో చిక్కుకున్నా.. పంట చేలు, తోటలు నీట నానుతున్నా ప్రభుత్వం నుంచి నిత్యావసర వస్తువులు తప్ప మరే సాయం అందకపోవడం గమనార్హం.

గోదావరికి ఈ ఏడాది తొలిసారి గత జూలై 20న వరద మొదలు కాగా, 28న ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ వద్ద నుంచి 15.90 లక్షల క్యూసెక్కుల వరద నీరు కిందకు వదిలారు. తిరిగి ఈ నెల 3న గోదావరికి రెండో సారి వరద వచ్చింది. 5న గరిష్ఠంగా 10.04 **లక్షల క్యూసెక్కులను వదిలారు. మరోసారి 8న వరద పోటెత్తింది. ఈసారి 15,29,127 క్యూసెక్కుల వరద** రావడంతో మరోసారి లంక గ్రామాలు నీట మునిగాయి. వరద ప్రాంతాల్లో 'సాక్షి' బృందం క్షేత్రస్థాయి పరిశీలనలో రైతులు, విద్యార్థులు, ఇళ్ల మునిగిన బాధితులు.. వేట నిలిచి పూట గడవని మత్స్యకారుల వెతలు దర్శనమిచ్చాయి.

- వరదలకు రైతులు అధికంగా నష్టపోయారు. మూడుసార్లు వరద రావడం, 20 రోజులకు పైగా పంటలు నీట నానుతున్నాయి. జూలై 23న వచ్చిన వరదతో 5,923.06 ఎకరాల్లో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది.
- 1,876 ఎకరాల్లో అరటి పంట దెబ్బతింది. అయితే మళ్లీ వరద రావడంతో నష్టం మరింత పెరుగుతోం**దని రైతులు వాపోతున్నారు. అధికారులు తొలి దశలో జరిగిన నష్టాల** నమోదుతో సరిపెట్టనున్నట్టు సమాచారం.
- 2,625 ఎకరాల్లో కూరగాయ పంటలు దెబ్బతిన్నాయి. రైతుల సాగు చేసిన రకాన్ని బట్టి ఎకరాకు రూ.25 వేల నుంచి రూ.40 వేల వరకూ పెట్టుబడిగా పెట్టారు.
- 71.43 ఎకరాల్లో తమలపాకుల తోటకు నష్టం జరిగింది. ఎకరాకు కనిష్ఠంగా రూ.నాలుగు లక్షల వరకూ పెట్టుబడి పెట్టారు. బొప్పాయి 182 ఎకరాలు, మిగిలినవి ఇతర పంటలు దెబ్బతిన్నాయి.
- అయినవిల్లి మండలంలో బత్తాయి పంట దెబ్బతిన్నా వినాయక చవితి సమయంలో లంక గ్రామాల్లో వరద ఉండడంతో బత్తాయి సేకరణకు అవాంతరం ఏర్పడి రైతులు నష్టపోయారు.
- ముమ్మిడివరం మండలం అయినాపురం పరిసర ప్రాంతాల్లో సుమారు 800 ఎకరాల్లో వరిచేలు నీట మునిగాయి.
- వరదలు లంక గ్రామాలకు చెందిన సామాన్యుల జీవితాలను చిన్నాభిన్నం చేస్తున్నాయి. పాడి రైతులు పాలు అమ్మకానికి, పశువుల మేతకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పి.గన్నవరం, అయినవిల్లి, ముమ్మిడివరం, మామిడికుదురు మండలాల్లో లంక గ్రామాల్లోనే పశువులు అధికం. వరదలతో వీటికి మేత కొరతతోపాటు పాడి అమ్ముకోవడానికి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
- వరదలతో 14 మండలాల్లో సుమారు 2 వేల మంది మత్స్యకారులకు వేట లేకుండా పోయింది.
- వరద బారిన పడిన లంక గ్రామాలకు పది పదిహేను రోజుల్లో సాధారణ పరిస్థితులు నెలకొని వాహన రాకపోకలు మొదలవుతాయి. కానీ పి.గన్నవరం మండలం గంటి పెదపూడి లంక, అరిగెలవారిపేట, ఊడిమూడిలంక, బూరుగులంక వాసులు మాత్రం ఏటా వరద మొదలైన నాటి నుంచి తిరిగి నవంబరు నెల వరకూ పడవలపైనే రాకపోకలు చేయాల్సి ఉంటోంది.
- మూడుసార్లు వరద వచ్చింది. దీనిలో రెండుసార్లు పలు లంక గ్రామాలను నిలువునా ముంచింది. ఇళ్లను తాకుతూ వరద ప్రవహించింది. బియ్యం, ఎంపిక చేసిన వస్తువులు తక్కువ మొత్తంలో అందించారు. గత ప్రభుత్వ హయాంలో బాధితుల కుటుంబాలకు నిత్యావసర వస్తువులతోపాటు రూ.రెండు వేలు పరిహారంగా అందించారు. పంట నష్టపోయిన మూడు నెలలకే పెట్టుబడి రాయితీ ఇచ్చారు.

మంచినీరు.. ఆహార ప్యాకెట్లతో సరి

గోదావరి వరదలకు లంక గ్రామాలు.. ఇళ్లు మునుగుతున్నా ప్రభుత్వం నిబంధనలు అంటోంది. మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తే కాని పూర్తిస్థాయిలో నిత్యావసర వస్తువులు అందించడం, పునరావస కేంద్రాల ఏర్పాటు, పరిహారం అందించలేమని చెబుతోంది. మూడు సార్లు వరద వచ్చి.. రెండు సార్లు ముంచెత్తినా ఎంపిక చేసిన ప్రాంతాల్లో ఆహారం.. మంచినీరు అందించి ప్రభుత్వం చేతులు దులుపుకొంది.

పరిహారం ఇవ్వలేదు



పెద్ద వరద వచ్చిన ప్రతిసారి నా ఇల్లు మునిగిపోతోంది. ఈసారి ఏకంగా రెండుసార్లు వచ్చిన వరద నా ఇంటిని ముంచింది. ప్రతిసారి కుటుంబం అంతా కష్టాలు పడ్డాం. ప్రభుత్వం నిత్యావసర వస్తువులు మాత్రమే అందించింది. నాయా పైసా పరిహారం ఇవ్వలేదు.

-సిరిగినీడి మంగతాయారు, పెదపట్నం, మామిడికుదురు మండలం

వంగ తోట ఊడ్చుకుపోయింది



ఈ ఏడాది ఎకరా పొలంలో వంగ సాగు చేశాను. రూ.25 వేలకు పైగా పెట్టుబడి పెట్టాను. జూలైలో వచ్చిన వరదలకే పంట మొత్తం దెబ్బతింది. ఉత్తరకార్తి నుంచి మళ్లీ పంటల సాగు పనులు మొదలు పెడతాం. గోదావరిలో ఇంకా వరద ఉంది. గత ప్రభుత్వం ఇచ్చినట్టుగా వెంటనే పరిహారం అందజేస్తే సాగు మొదలు పెట్టగలం.

-సలాది వెంకటేశ్వరరావు, కూరగాయల రైతు, పొట్టిలంక, అయినవిల్లి మండలం

రోజూ పడవపై దాటుతున్నాం



మాది పి.గన్నవరం మండలం బూరుగులంక. నాకు రెండు గేదెలు ఉన్నాయి. పాలను గోదావరి పాయలను దాటుకుని జి.పెదపూడి వెళ్లి అమ్మకాలు చేయాల్సి ఉంది. జూలై నెల 15 నుంచి నవంబరు నెల వరకూ పడవ దాటి పాల అమ్మకాలు చేసుకోవాలి. గోదావరిలో వరద ఉధృతి ఎంత ఉన్నా కుటుంబ పోషణ కోసం ప్రాణాలు పణంగా పెట్టి పడవపై దాటి పాల విక్రయాలు చేయాల్సి ఉంది.**-బొలిశెట్టి విష్ణుమూర్తి, పాడి రైతు, బూరుగులంక, పి.గన్నవరం మండలం**

పూట గడవడం కష్టం



నేనే పదిహేళ్ల నుంచి వేట వృత్తిగా జీవనం సాగిస్తున్నాను. నాకు ముగ్గురు పిల్లలు. ఇప్పుడు గోదావరిలో అనుకున్న స్థాయిలో చేపలు దొరకడం లేదు. వరదల కారణంగా మా నివాసాలు మునిగిపోతున్నాయి. వరద వచ్చిన ప్రతిసారీ వారం నుంచి పది రోజుల పాటు వేట సాగక పూట గడవం కష్టంగా మారుతుంది. ప్రభుత్వం పరిహారం ఇవ్వాలి.

-సంగాని బాలరాజు, మత్స్యకారుడు, బోడసకుర్రు పల్లిపాలెం, అల్లవరం మండలం


మళ్లీ అప్పులు చేయాలి



నేను రెండు ఎకరాల అరటి తోట వేశాను. ఇప్పటి వర కూ రూ.1.50 లక్షల వరకూ పెట్టుబడి పెట్టాను. వరదలకు తోట నీట నానింది. ఇంకా ముంపు వీడలేదు. ఇప్పటికే ఎకరా పంట దెబ్బతింది. మిగిలిన పంట కూడా నీటిలో ఎక్కువగా ఉండడం వల్ల వేరు కుళ్లు వ్యాధి సోకి చనిపోయే ప్రమాదముంది. ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలి. లేకుంటే మళ్లీ పంట సాగుకు పెట్టుబడికి అప్పులు చేయాల్సి వస్తోంది.

-అదపా పెదకాపు, వీరవల్లిపాలెం

రైల్వే లైన్ పనులు వేగవంతం చేయించండి



కేంద్ర మంత్రి వర్మకు వినతి పత్రం అందిస్తున్న కోనసీమ రైల్వే సాధన సమితి ప్రతినిధులు

కేంద్ర మంత్రి వర్మకు కేఆర్‌ఎస్‌ఎస్ బృందం వినతి

అమలాపురం టౌన్: కోటిపల్లి– నరసాపురం రైల్వే లైన్ నిర్మాణ పనులను వేగవంతం చేయించాలని కోరుతూ కేంద్ర మంత్రి బి.శ్రీనివాస వర్మకు కోనసీమ రైల్వే సాధన సమితి (కేఆర్‌ఎస్‌ఎస్) ప్రతినిధుల బృందం వినతిపత్రం అందించింది. అయినవిల్లి విఘ్నేశ్వర స్వామి ఆలయ దర్శనానికి వచ్చిన కేంద్ర మంత్రిని కేఆర్‌ఎస్‌ఎస్ బృందం శనివారం ఉదయం కలసి రైల్వే లైన్ విషయమై కొద్దిసేపు మాట్లాడింది. కోనసీమ రైల్వే ప్రాజెక్టుకు సంబంధించి ఇప్పటికే ఈ సీమలోని మూడు నదులపై వంతెన నిర్మాణాలు జరుగుతున్నాయని గుర్తు చేశారు. ఇదే సమయంలో పనులు వేగవంతం చేయాలని బృందం కోరింది. ముఖ్యంగా రైల్వే లైన్‌కు అవసరమైన భూ సేకరణను త్వరగా పూర్తిచేసి కోనసీమలో తొందర్లలోనే రైలు పరుగులు తీసేలా చేయాలని కేంద్ర మంత్రిని బృంద ప్రతినిధులు అభ్యర్థించారు. కేఆర్‌ఎస్‌ఎస్ స్టీరింగ్ కమిటీ ప్రతినిధులు కల్వకొలను తాతాజీ, ఆర్‌వీ నాయుడు, పోలిశెట్టి శివాజీ, వై.వెంకటేశ్వరరావు తదితరులు కేంద్ర మంత్రికి వినతి పత్రం అందించారు. కమిటీ ప్రతినిధి, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు మోకాలికి శస్త్రచికిత్స చేయించుకోవడంతో ఆయన రాకపోయినప్పటికీ ఆయన ఈ వినతి పత్రంలో రైల్వే లైన్ పూర్తి చేయాల్సిన ఆవశ్యకతపై వివరించారు.

నీలమేఘశ్యామ గోవిందా..



వెంకన్న ఆలయం వద్ద భక్తులు



ప్రత్యేక అలంకరణలో వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి

ఆత్రేయపురం: భక్తవత్సల గోవిందా.. భాగవతా ప్రియ గోవిందా.. అంటూ ఆ శ్రీనివాసుడిని స్మరిస్తూ భక్తజనం మురిసింది.. కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం శనివారం భక్తులతో కిక్కిరిసింది. ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం తదితర పూజాదికాలు నిర్వహించారు. అనంతరం వేదపండితులు, అర్చకులు శ్రీవేంకటేశ్వర స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. వేకువజాము నుంచే తరలివచ్చిన భక్తులు తలనీలాలు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. ఏడు శనివారాల నోము ఆచరిస్తున్న వారు ఏడు ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కోరిన కోర్కెలు తీరిన భక్తులు కొందరు కాలినడకన స్వామివారి ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ఆవరణలో వేలాది మందికి అన్న సమారాధన జరిగింది. ఆలయ ప్రాంగణంలో గోవింద నామస్మరణ మార్మోగింది. దేవదాయ ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ భూపతిరాజు కిషోర్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలాగే పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి శ్రీజగన్మోహినీ కేశవస్వామి ఆలయం, ఆత్రేయపురం శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మార్మోగిన గోవిందనామ స్మరణ

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి ఆలయంలో గోవింద నామస్మరణ మార్మోగింది. కలియుగ ప్రత్యక్ష దైవంగా భాసిల్లుతున్న శ్రీబాల బాలాజీ స్వామి, భూదేవి, శ్రీదేవిలను భక్తులు దర్శించుకుని మహదానందం పొందారు. తమ కోర్కెలు నెరవేరాలని స్వామి వారిని కొలిచారు. పవిత్ర వైనతేయ గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించిన భక్తులు స్వామివారికి తలనీలాలు సమర్పించారు. ముడుపులు, మొక్కుబడులు చెల్లించారు. స్వామివారికి వివిధ సేవల ద్వారా రూ.1,76,298 ఆదాయం లభించిందని ఆలయ ఈఓ వి.సత్యనారాయణ తెలిపారు. లడ్డూ ప్రసాదం, దర్శనం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.1,29,510 ఆదాయం వచ్చిందన్నారు. నిత్యాన్నదాన ట్రస్టుకు భక్తులు రూ.46,788 చెల్లించారని తెలిపారు. 3,496 మంది స్వామి వారిని దర్శించుకోగా, 1,852 మంది అన్న ప్రసాదం స్వీకరించారు.

వైద్య విద్యపై బాబు కుతంత్రం

- నిలిచిపోయిన వైద్య కళాశాల పనులు
- కూటమి ప్రభుత్వ నిర్వాకం
- ప్రైవేట్ పరం చేయడంపై వెల్లువెత్తిన నిరసన
- సీట్లు తగ్గుతాయని విద్యార్థుల ఆందోళన



అమలాపురంలో నిలిచిపోయిన ప్రభుత్వ వైద్య కళాశాల పనులు

సాక్షి, అమలాపురం: పేద, మధ్యతరగతి విద్యార్థులకు వైద్య విద్యను కూటమి ప్రభుత్వం దూరం చేస్తోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాకు ఓ మెడికల్ కాలేజీ నిర్మాణానికి శ్రీకారం చుట్టగా, ఇప్పుడు వాటికి నిధుల కొరత చూపించి పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానంలో మెడికల్ కాలేజీలను అప్పగించేందుకు సిద్ధమైంది. తద్వారా ప్రభుత్వ వైద్యాన్ని కార్పొరేట్‌కు అప్పగించేందుకు సన్నద్ధమైంది.

గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పార్లమెంట్ నియోజకవర్గానికి ఒక మెడికల్ కాలేజీ చొప్పున మంజూరు చేసింది. అమలాపురం పట్టణాన్ని ఆనుకుని సమనస, చిందాడగరువు పరిధిలో దీని నిర్మాణానికి రూ.500 కోట్లతో శ్రీకారం చుట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా మూడో దశలో మొదలు పెట్టిన అమలాపురంలో మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు గత ప్రభుత్వంలో వేగంగా జరిగాయి. కాలేజీకి అనుబంధంగా అమలాపురం ఏరియా ఆసుపత్రిని బోధనాసుపత్రిగా విస్తరించాలని నిర్ణయించారు. 100 పడకల ఆసుపత్రిని తొలి దశలో 650 పడకలుగా, తరువాత వెయ్యి పడకల ఆసుపత్రిగా మార్పు చేయాలని ప్రతిపాదించారు. అమలాపురంలో అన్ని వసతులతో కూడిన ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అందుబాటులోకి వస్తోందని కోనసీమ వాసులు భావించారు. గత ప్రభుత్వంలో ఆసుపత్రి భవన నిర్మాణాలు చురుగ్గా సాగాయి. కొన్ని భవనాలకు రెండు, నాలుగు అంతస్తులు సైతం నిర్మించారు. ఎన్నికల తరువాత నుంచి పనులు నెమ్మదించాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పనులు మొత్తం ఆగిపోయాయి. దీనిపై స్థానిక సంస్థల ప్రతినిధులు జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్, అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. నిర్మాణ సంస్థ ఇక్కడ నుంచి సామగ్రిని పట్టుకుని పోవడం విశేషం.

చదువు సాగేదెలా?

ప్రభుత్వ మెడికల్ కాలేజీలను పీపీపీ విధానంలో కార్పొరేట్ చేస్తే తాము వైద్య విద్యపై ఆశలు వదులుకోవాల్సిందేనని పేదలు, సామాన్య, మధ్యతరగతి వర్గాలకు చెందిన విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిభ ఉండి కూడా ప్రైవేట్ కాలేజీల్లో చదివే స్తోమత లేని వారు కూటమి ప్రభుత్వ నిర్ణయంపై మండిపడుతున్నారు. నీట్ పరీక్ష రాసిన విద్యార్థులు, వారు తల్లిదండ్రులు ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుపడుతున్నారు.

పేదలకు వైద్యం అందే దారేది

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కాకినాడ, రాజమహేంద్రవరాల్లో మాత్రమే ప్రభుత్వ జనరల్ ఆసుపత్రులు (జీజీహెచ్)లు ఉన్నాయి. కోనసీమలో కిమ్స్ ప్రైవేట్ మెడికల్ కాలేజీ, ఆసుపత్రి ఉన్నా రోగుల అవసరాలు పూర్తిగా తీర్చడం లేదు. అమలాపురం, రామచంద్రపురం మున్సిపాలిటీల్లో ఏరియా ఆసుపత్రులు ఉన్నాయి. అమలాపురం, కొత్తపేట, ముమ్మిడివరం, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల ప్రజలకు ప్రభుత్వ పరంగా మెరుగైన వైద్యం అందే అవకాశం లేదు. వైరల్ జ్వరాలకు పేదలు, సామాన్యులు కూడా కార్పొరేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వచ్చింది. డెంగీ వంటి జ్వరాలు వస్తే సాధారణ వ్యక్తులు కూడా రూ.30 వేల నుంచి రూ.70 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. అదే ప్రభుత్వ ఆసుపత్రులు అందుబాటులో ఉంటే వైద్యం దాదాపు ఉచితంగా పొందే అవకాశముంది. అలాగే శస్త్రచికిత్సలు వంటివి చాలా తక్కువలో అయిపోతాయి. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మెడికల్ కాలేజీ మంజూరు చేయడంతో మెరుగైన వైద్యం అందుబాటులోకి వస్తోందని ప్రజలు ఆశించారు. కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీ, ఆసుపత్రిని ప్రైవేట్ పరం చేయనుందని తెలిసి సామాన్యులు ఆందోళన చెందుతున్నారు.

విద్యతో వ్యాపారం చేస్తారా?



రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణాలకు బ్రేకులు వేసి, వాటిని ప్రైవేటుపరం చేస్తూ వైద్య విద్యనూ మరింత వ్యాపారం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నించడం బాధాకరం. గత ప్రభుత్వంలో పలు ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణాలకు శ్రీకారం చుట్టినప్పుడు రాష్ట్రంలో పేద, సామాన్య కుటుంబాల పిల్లలు వైద్య విద్యభ్యసించే అవకాశం వచ్చిందని ఆనందించాం. కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలల నిర్మాణాలను ప్రైవేటు భాగస్వామ్యంతో నిర్మిస్తామని చెప్పడం సరికాదు.

-రేవు తిరుపతిరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, పీడీఎస్‌యూ

ఆర్థిక భారం కాకూడదు



నేను నీట్ పరీక్ష రాసి అందులో క్వాలిఫై అయ్యాను. నాలాంటి సామాన్య కుటుంబానికి వైద్య విద్యనభ్యసించడం ఆర్థిక భారం కాకూడదు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా నిర్మించే వైద్య కళాశాలలను ప్రైవేటు పరం చేస్తామని ప్రకటించడం, నాలాంటి విద్యార్థులకు ఆర్థిక భారమే. అదే కొత్తగా నిర్మించే వైద్య కళాశాలలు ప్రభుత్వపరంగా ఏర్పాటైతే పేద, సామాన్య కుటుంబాలకు చెందిన విద్యార్థులకు మేలు జరుగుతోంది. అందే ప్రైవేట్ వైద్య కళాశాలల్లో మెడికల్ సీటు కోసం రూ.లక్షల్లో ఖర్చు చేయాలి.

-యు.సాల్మన్‌రాజు, ఎస్.యానాం, ఉప్పలగుప్పం మండలం

క్లుప్తంగా

స్టాఫ్ నర్సులు ఆందోళన చెందవద్దు

ఏపీఎన్జీఓ రాష్ట్ర అధ్యక్షుడు శివారెడ్డి

కాకినాడ క్రైం: జీఓ నంబరు 115ను అనుసరించి ఏఎన్ఎంలను రెగ్యులర్ స్టాఫ్ నర్సులుగా నియమించే అవకాశం లేదని, ఈ విషయాన్ని ప్రిన్సిపల్ సెక్రటరీ తనకు స్పష్టం చేశారని ఏపీఎన్జీఓ రాష్ట్ర అధ్యక్షుడు శివారెడ్డి అన్నారు. జీఓపై కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు ఆందోళన చెందొద్దని భరోసా ఇచ్చారు. శనివారం కాకినాడకు వచ్చిన ఆయనను ఏపీ స్టేట్ నర్సెస్ స్ట్రగుల్ కమిటీ అధ్యక్షురాలు మామిడి చిన్నారి ఆధ్వర్యంలో నర్సింగ్ ఆఫీసర్లు ఏపీఎన్జీవో హోంలో కలిశారు. ఈ సందర్భంగా జీఓ నంబరు 115పై తమ ఆందోళన వెల్లబుచ్చారు. స్పందించిన శివారెడ్డి నూతన వైద్య కళాశాలల ఏర్పాటు నేపథ్యంలో నర్సింగ్ వ్యవస్థను బలోపేతం చేయడానికి మాత్రమే ఏఎన్ఎంలకు శిక్షణ ఇచ్చి నర్సింగ్ సేవల్లో నియమించారని, అది స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీ కోసం కాదనే విషయాన్ని గుర్తించాలన్నారు. ఇందుకు వారికి అందుతున్న జీతానికి అదనంగా మరో రూ.5 వేలు గౌరవ వేతనాన్ని ఇస్తున్నారన్నారు. ఏఎన్ఎంలను రెగ్యులర్ స్టాఫ్ నర్సులుగా నియమిస్తున్నట్లు ఆదేశాలేవీ ఆ జీఓలో లేదని స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం ఉన్న ఖాళీ స్టాఫ్ నర్సు పోస్టుల్లో ఏ ఒక్కటీ ఏఎన్ఎంలతో భర్తీ కాబోదని కాంట్రాక్టు నర్సులకు ధైర్యం చెప్పారు. శివారెడ్డితో పాటు ఏపీఎన్జీఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పురుషోత్తమ నాయుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసులేటి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్‌రావు, జిల్లా కార్యదర్శి వెంకట కృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు పాలపర్తి మూర్తిబాబు ఉన్నారు. వీరిని కలిసిన వారిలో స్టాఫ్‌నర్సులు శ్రీనివాస్, సత్యసింధు, సుందరి, క్రిష్టీ తదితరులు ఉన్నారు.

రేషన్ బియ్యం సీజ్

నిడదవోలు రూరల్: విజ్జేశ్వరం శివారు కృష్ణసాయి రైస్‌మిల్లులో 17 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని శనివారం సీజ్ చేసి, 6–ఏ కేసు నమోదు చేసినట్లు నిడదవోలు సివిల్ సప్లయిస్ డీటీ ఎం.అనిల్‌కుమార్ తెలిపారు. విజిలెన్స్, సివిల్ సప్లయిస్ అధికారులకు వచ్చిన సమాచారంతో దాడులు నిర్వహించగా, ఆకుల పేర్రాజు అనే వ్యక్తి తన వాహనంపై రేషన్ బియ్యం తీసుకువచ్చి రైస్ మిల్లులో విక్రయించాడని తేలింది.

ఈ మిల్లులో రూ.1.20 లక్షల విలువైన 17 క్వింటాళ్ల రేషన్ బియ్యం గుర్తించారు. మిల్లు యజమాని ముళ్లపూడి గోపాలకృష్ణ, నిందితుడు ఆకుల పేర్రాజుపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని విజిలెన్స్ అధికారులు నాగ వెంకటరాజు, విజయ్‌కుమార్, జీవానందం, శివ తదితరులు పాల్గొన్నారు.



విజ్జేశ్వరంలో రేషన్ బియ్యాన్ని సీజ్ చేసిన సివిల్ సప్లయిస్, విజిలెన్స్ అధికారులు

బరువులెత్తుతాం... సత్తా చాటుతాం

- అమలాపురంలో రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు
- 400 మంది క్రీడాకారులు హాజరు



రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ పోటీల్లో తొలి రోజు విజేతలైన మహిళా లిఫ్టర్లతో జిల్లా అసోసియేషన్ ప్రతినిధులు, న్యాయ నిర్ణేతలు

అమలాపురం టౌన్: బరువులెత్తుతాం.. సత్తా చాటుతాం అంటూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పవర్ లిఫ్టర్లు పోటాపోటీగా తలపడ్డారు.. తమలోని ప్రతిభ చాటేందుకు సాయశక్తులా ప్రయత్నించారు. ఎంతో ఉత్కంఠగా సాగిన ఈ పోటీలకు అమలాపురం వేదికైంది. జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్, అమలాపురం హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్ స్పోర్ట్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో 11వ ఆంధ్రప్రదేశ్ స్టేట్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్–2024 పోటీలు స్థానిక ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్ ప్రాంగణంలో శనివారం ఉదయం నుంచి ప్రారంభమయ్యాయి. శని, ఆదివారాల్లో జరిగే ఈ పోటీలను అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ప్రారంభించారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి దాదాపు 400 మంది క్రీడాకారులు హాజరై బరువులెత్తి తమ సత్తా చాటారు. సబ్ జూనియర్స్, సీనియర్స్, మాస్టర్స్ విభాగాల్లో పురుష, మహిళా క్రీడాకారులు పాల్గొని క్లాసిక్ పవర్ లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్, డెడ్ లిఫ్ట్, స్క్వాట్ లిఫ్ట్ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అనుబంధంగా ఈ రాష్ట్ర స్థాయి పోటీలు హైదరాబాద్, విశాఖపట్నం మెట్రో కెమ్ కంపెనీల అధినేత డాక్టర్ నందెపు బాలాజీ సౌజన్యంతో జరుగుతున్నాయి. జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యెనుముల కృష్ణ పద్మరాజు, కార్యదర్శి వంటెద్దు వెంకన్నాయుడు, హెల్త్ ఫిట్‌నెస్ జిమ్ స్పోర్ట్స్ క్లబ్ కోచ్ డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరరావుల పర్యవేక్షణలో నిర్వహిస్తున్నారు. పవర్ లిఫ్టర్‌లు వివిధ కేటగిరీల్లో 100 కిలోల బరువు నుంచి 200 కిలోల వరకూ ఎత్తి సత్తారు. ఈ రాష్ట్ర స్థాయి పోటీలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి 61 మంది లిఫ్టర్లు పాల్గొంటే, ఇతర జిల్లాల నుంచి అత్యధికంగా ఎన్టీఆర్ జిల్లా నుంచి 55 మంది పాల్గొన్నారు. తర్వాత గుంటూరు జిల్లా నుంచి 40 మంది హాజరయ్యారు. రెండో రోజు ఆదివారం జరిగే పోటీలకు రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి మరో 150 మంది వరకూ రానున్నారని జిల్లా అసోసియేషన్ నిర్వాహకులు తెలిపారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా జి.వెంకటేశ్వర్లు (జగ్గయ్యపేట), ఎస్.కోటేశ్వరరావు (విశాఖపట్నం), ఏవీ ప్రసాద్ (బాపట్ల), సత్యనారాయణ (రాజమహేంద్రవరం), సూర్యనారాయణ (విశాఖపట్నం), డి.అనూజ (ఎన్టీఆర్ జిల్లా), ఈవీఎస్ శివకుమార్ (విశాఖపట్నం), హెచ్.గణేష్ (విశాఖపట్నం) వ్యవహరించారు. రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ దొమ్మేటి వెంకట రమణ, జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్



పోటీల్లో బరువులెత్తి సత్తా చాటుతున్న ఓ మహిళా పవర్ లిఫ్టర్

గౌరవాధ్యక్షుడు నగభేరి కృష్ణమూర్తి, జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గారపాటి శేఖర్‌లు పాల్గొని క్రీడాకారులకు సహకారం అందించారు. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లాడ శరత్, కోనసీమ షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు మెట్ల రమణబాబు, జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మాజీ అధ్యక్షుడు పప్పుల శ్రీరామ చంద్రమూర్తి పాల్గొన్నారు.

జాతీయ పోటీల్లో పాల్గొన్నా..



నేను ఇప్పటి వరకూ పది జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొన్నాను. మొత్తం 9 పతకాలు సాధించాను. వరల్డ్ చాంపియన్ షిప్, యూనివర్సిటీ చాంపియన్ షిప్, స్ట్రాంగ్ వుమెన్ ఇలా పలు విజయాలు సొంతం చేసుకున్నా. మా నాన్న ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టర్, ఆయన స్ఫూర్తితోనే ఈ క్రీడలో సుస్థిర స్థానం సాధించే దిశగా శ్రమిస్తున్నా.

–సాదియా, ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టర్, మంగళగిరి, గుంటూరు జిల్లా

గుర్తింపు తెచ్చుకోవాలని..



నేను ఇప్పటి వరకూ ఐదు ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొన్నా. ఒక బంగారు పతకం సాధించాను. అంతర్జాతీయ స్థాయిలో పవర్ లిఫ్టర్‌గా గుర్తింపు తెచ్చుకోవాలనే దిశగా శ్రమిస్తున్నాను. ఇప్పుడు అమలాపురంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని సత్తా చాటాను. పవర్ లిఫ్టింగ్ పోటీలు ఎక్కడ జరుగుతున్నా వాటికి నేను హాజరవుతున్నా.

–మురళీకృష్ణ, ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టర్, మచిలీపట్నం, కృష్ణా జిల్లా

సంస్కృతికి వేదాలు పట్టుగొమ్మలు



గంగలకుర్రులో వేద సభ నిర్వహిస్తున్న ఘనాపాఠీలు

అంబాజీపేట: భారతీయ సంస్కృతీ సంప్రదాయాలకు, ధర్మాలకు వేదాలు పట్టుగొమ్మలుగా నిలుస్తున్నాయని తెనాలికి చెందిన ప్రముఖ వేదపండితులు విష్ణుభట్ల ఆంజనేయ చయనులు, రాజమహేంద్రవరానికి చెందిన విశ్వనాథ గోపాలకృష్ణ శాస్త్రిలు, తి.తి.దే.కు చెందిన వేదిక్ యూనివర్సిటీ ప్రొఫెసర్ దువ్వూరి ఫణియజ్ఞేశ్వర సోమయాజులు ఉద్ఘాటించారు. గంగలకుర్రులో జయంతి భాస్కరసుబ్రహ్మణ్యం తన తండ్రి నరసింహమూర్తి జ్ఞాపకార్థం 23వ వేదశాస్త్ర విద్వత్ సభ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ యజుర్వేదానికి చెందిన 150 మంది రుగ్వేద, అథర్వణ వేదం, సామవేదానికి చెందిన మరో 150 మంది వేద పండితులు నిర్వహించిన వేద ఘోషతో దద్దరిల్లింది. వేద పఠనంతో లోకానికి, దేశానికి ఎంతో మంచి జరుగుతుందని ఆంజనేయ చయనులు అన్నారు. ప్రస్తుత సమాజంలో ప్రజలు అపమృత్యు దోషాలతో కాలం చేస్తున్నారని, వారికి వేద పఠనం అమృతంలా పని చేస్తుందన్నారు. హోమం చేస్తే ఎంత ఫలితం లభిస్తుందో వేదస్వస్తి వింటే సామాన్యులకు సైతం పూర్తి ఫలితం లభిస్తుందన్నారు. ఈ వేద సభలో శ్రీపాద మాణిక్యావధాన ఘనాపాఠి, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వేద పండితులు పాల్గొన్నారు. తొలుత కర్రా దత్తు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు కోనసీమ వేదశాస్త్ర సన్మాన సభ

అమలాపురం టౌన్: శ్రీకోనసీమ వేదశాస్త్ర సన్మాన సభ సంస్థ ఆధ్వర్యంలో అమలాపురం శ్రీసత్యసాయి కల్యాణ మండపంలో 62వ వేద విద్యత్సత్కార సభ ఆదివారం జరుగనుంది. ఏటా వామన జయంతి రోజున వేదశాస్త్ర సన్మాన సభ వార్షికోత్సవాన్ని ఉభయ రాష్ట్రాల స్థాయిలో నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. వేదాలు, వేద పండితులను ప్రోత్సహిస్తూ వేదసభను ఈ సంస్థ నిర్వహిస్తూ వస్తోంది. ఈ సభకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి దాదాపు 200 మంది వేద ఘనాపాఠీలు, వేద పండితులు అమలాపురానికి వస్తారని ఆ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు గుళ్లపల్లి ప్రభాకర ఫణిరాజా, గుళ్లపల్లి వెంకట్రామ్ తెలిపారు. కడియాల వెంకట సత్యనారాయణ ఘనాపాఠి అధ్యక్షతన జరుగనున్న ఈ సభ వేదాధ్యయనం చేసి వేదాల మనుగడను కాపాడడమే కాకుండా వేదాలసారం భవిష్యత్ తరాలకు అందించే దిశగా వేద చర్చ జరుగనుంది. సాయంత్రం 3 గంటల నుంచి పండితోపన్యాసంతో వేద సభ మొదలవుతుంది. అనంతరం వందలాది వేద పండితులు ఏక కంఠంతో లోక కల్యాణార్థం వేద స్వస్తి, ఆశీర్వచనం నిర్వహిస్తారు. చివరిగా శ్రీకోనసీమ వేదశాస్త్ర సన్మాన సభ ఆధ్వర్యంలో వేద పండితులకు సామూహిక సత్కారాలు జరుగుతాయి. వేదసభకు కోనసీమలోని వేదాభిమానులు తరలిరావాలని ఆ సంస్థ కార్యదర్శి గుళ్లపల్లి వెంకట్రామ్ విజ్ఞప్తి చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



రైలు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి

తుని: రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు స్థానిక జీఆర్పీ హెచ్ కానిస్టేబుల్ జి.మోహన్ శనివారం తెలిపారు. ఆ వివరాల్లోకెళ్తే.. సుమారు 40 ఏళ్ల వ్యక్తి రైలులో ప్రయాణిస్తూ తుని, గుల్లిపాడు రైల్వే స్టేషన్ల మధ్య జారిపడి మృతి చెందాడు. మృతుడు నాచురంగుపై తెలుపు చుక్కలు కలిగిన చొక్కా, ప్యాంట్ ధరించి ఉన్నాడు. ఇతని చేతిపై బెంగాలీ భాషలో పచ్చబొట్టు ఉంది. మృతదేహాన్ని స్థానిక ఏరియా ఆసుపత్రిలో భద్రపరిచారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 94906 19020 నంబరులో సంప్రదించాలన్నారు.

ఆకట్టుకున్న దేవ నర్తకి నాటకం

ఉప్పలగుప్తం: మండలంలోని కూనవరం గ్రామంలో కర్షక గణపతి నవరాత్ర ఉత్సవాల వేదికపై శుక్రవారం సాయంత్రం జరిగిన దేవ నర్తకి నాటక ప్రదర్శన ప్రజలను ఆకట్టుకుంది. ప్రముఖ సినీ హాస్య, జబర్దస్త్ నటుడు అప్పారావు, కడప రత్నశ్రీ కాంబినేషన్‌లో నాటకాన్ని కళాకారులు అద్భుతంగా ప్రదర్శించారు. నాటకాన్ని చూడటానికి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా నటుడు అప్పారావు మాట్లాడుతూ ప్రస్తుతం నాటకాలకు ఆదరణ తగ్గుతుందని, ప్రతి ఒక్కరూ నాటకాలను, కళాకారులను ప్రోత్సహించాలన్నారు. అనంతరం కూనవరం గ్రామస్తులు కళాకారులను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు.

ప్రభుత్వాసుపత్రుల్లో పోస్టులు భర్తీ చేస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్
- రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో అధికారులతో సమీక్ష

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు సరిపడా వైద్యులు లేరని, త్వరలోనే ఆ పోస్టులను భర్తీ చేస్తామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిని ఆయన శనివారం సందర్శించారు. ఆసుపత్రి వైద్యాధికారులు, వైద్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రుల్లో మౌలిక సదుపాయాలపై దృష్టి సారించనున్నామని తెలిపారు. వైద్య సేవల్లో మెరుగైన చికిత్స విధానాలు, మౌలిక సదుపాయాల కల్పనలో పలు మార్పులు తీసుకురావడానికి కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. వైద్య వృత్తి ఎంతో గౌరవప్రదమైందని, వైద్య సేవలు అందించే వారు పరిమితులకు లోబడి పని చేయాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగే లోటుపాట్లను అధిగమించేందుకు మార్పు తీసుకురావడంలో వైద్యులంతా కలిసి పనిచేయాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఇటీవల కాలంలో మూడు శిశు మరణాలు సంభవించడం ఎంతో బాధను కలిగించిందన్నారు. నిర్లక్ష్యం వల్ల ఏ ఒక్క ప్రాణం కూడా పోవడానికి వీలులేదన్నారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ఆసుపత్రి నిర్వహణ వ్యవస్థ, వైద్య సేవలు అందించే క్రమంలో రోగులకు ఎదురవుతున్న సమస్యలను యాదవ్ దృష్టికి తీసుకువచ్చారు. బయటి వ్యక్తుల ద్వారా రోగులు దోపిడీకి గురవుతున్నారని, ఈ సమస్య పరిష్కరిస్తామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హామీ ఇచ్చారన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆసుపత్రిలో మార్చురీ గదిలో ఫీజర్స్ ప్రైవేటు వ్యక్తులు ఏర్పాటు చేసి, అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తూ, రోగులను దోచుకుంటున్నారన్నారు. వాటిని నియంత్రించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.లక్ష్మీ సూర్యప్రభ ఆసుపత్రి వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలిపారు.

ఏపీఎంఎస్ఐడీసీ డివిజనల్ ఇంజినీర్ కృష్ణారావు వైద్య కళాశాల భవనాల నిర్మాణం, మౌలిక సదుపాయాలు, వచ్చే విద్యా సంవత్సరానికి చేపట్టనున్న పనుల వివరాలను తెలియజేశారు. కలెక్టర్ పి.ప్రశాంతి, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, బత్తుల బలరామకృష్ణ, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, డాక్టర్ కామినేని శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా పవిత్రోత్సవాలు



అంతర్వేది ఆలయంలో స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకుడు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో శనివారం స్వామివారి వార్షిక పవిత్రోత్సవాలు మూడో రోజు కొనసాగాయి. ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యంలో ఉదయం విష్వక్సేన పూజ, పుణ్యహ వచనంతో అర్చకులు పవిత్రోత్సవాలను ప్రారంభించారు. స్వామివారి ఉత్సవమూర్తులను ఆలయంలోని పురాతన కల్యాణ మండపంలో ప్రత్యేక వేదికపై ఆశీనులు చేశారు. పంచ సూక్తాలతో స్వామివారికి అర్చకులు అభిషేకం చేశారు. సర్వ దైవత్య హోమం, పంచసూక్తాలతో హోమం, మహా శాంతి హోమం నిర్వహించారు. అనంతరం స్వామికి ప్రత్యేక అలంకరణ చేసి, విశేష పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమార రామగోపాలరాజా బహద్దూర్, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఒక్క మాత్రతో నులిమేద్దాం..

- ఆల్బెండజోల్‌తో రక్తహీనతకు చెక్
- 17న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం



డీవార్మింగ్ మాత్రలు మింగిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది (ఫైల్)

రాయవరం: నులి పురుగు.. ఈ మాట వినడానికి చిన్నగానే ఉన్నా మనిషికి కలిగించే అనారోగ్యం పెద్దదే. చిన్నారుల్లో రక్తహీనతకు, రోగాలకు కారణమవుతున్న నులి పురుగుల నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా రెండు సార్లు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తున్నాయి. ఈ ఏడాది కూడా ఈ నెల 17న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసేందుకు వైద్య ఆరోగ్యశాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. 2024–25 విద్యా సంవత్సరంలో మొదటి విడత ఆల్బెండజోల్ మాత్రలను ఒకటి నుంచి 19 ఏళ్ల విద్యార్థులకు అందజేసింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 3,04 లక్షల మందికి ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. ప్రతి పీహెచ్‌సీకి అదనంగా 10 శాతం మాత్రలను బఫర్ స్టాక్‌గా పంపించారు.

చిన్నారుల ఆరోగ్యంపై ప్రభావం

నులి పురుగులు చిన్నారుల ఆరోగ్యంపై అధిక ప్రభావాన్ని చూపిస్తున్నాయి. ముఖ్యంగా రక్తహీనత, పోషకాల లోపం బారిన పడతారు. చిన్నారుల కడుపులో కొంకి, నులి, బద్దె, గుండ్రని పురుగులు పెరిగితే అవి రక్తాన్ని పీల్చేస్తాయి.

ఆ పురుగుల పునరుత్పత్తి, ఎదుగుదల మొత్తం జీర్ణ వ్యవస్థలో జరగడంతో మనం తీసుకునే ఆహారాన్ని ఆ పురుగులు శోషించుకుంటాయి. ఫలితంగా పదేళ్ల వయసున్న వాళ్లలో ఎక్కువగా రక్తం లేకుండా బాధపడడం, పౌష్టికాహార లోపం, ఆకలి లేకపోవడం, బలహీనత, కడుపునొప్పి, వికారం, వాంతులు, అతిసారం, మలంలో రక్తం పడడం తదితర వ్యాధి లక్షణాలు కనిపిస్తాయి. దీనిని అరికట్టేందుకు ఆల్బెండజోల్ మాత్రలను మింగించాలి.

కోనసీమ జిల్లాలో ఇలా..

అంగన్‌వాడీ కేంద్రాల నుంచి అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ ప్రథమ సంవత్సరం, ఐటీఐ, పాలిటెక్నిక్, నర్సింగ్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను ఉచితంగా పంపిణీ చేస్తారు. కోనసీమ జిల్లాలో 3,948 వివిధ విద్యా సంస్థల్లో 3,04,018 మందికి డీవార్మింగ్ మాత్రలు మింగించడమే లక్ష్యంగా నిర్ణయించారు. జిల్లాలోని 1,726 అంగన్‌వాడీ కేంద్రాలు, 2,036 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, 97 ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్, 53 డిగ్రీ కళాశాలలు, 36 ఐటీఐ, పాలిటెక్నిక్, నర్సింగ్ కళాశాలలు, ఏడు ఇంజినీరింగ్ కళాశాలల్లో ఉన్న విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను అందజేస్తారు.

మాత్రలు వేసుకునే విధానం

ఏడాది లోపు వారికి, తీవ్రమైన అనారోగ్యం కలిగి ఉన్నవారికి ఈ మాత్రలు ఇవ్వరాదు. ఒకటి నుంచి 19 ఏళ్ల వయసున్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తీసుకోవాలి. వీటిని తీసుకోవడం వల్ల నులి పురుగుల నిర్మూలన జరిగి, రక్తహీనత దూరం అవుతోంది. ఒకటి నుంచి రెండేళ్ల లోపు పిల్లలు సగం ఆల్బెండజోల్ మాత్రను (200 ఎంజీ), రెండేళ్లకు పైబడిన వారు ఒక మాత్ర(400 ఎంజీ) తీసుకోవాలి.

మధ్యాహ్నం భోజనం చేశాకే..



ఆల్బెండజోల్ మాత్రలను మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత మాత్రమే విద్యార్థులకు ఇవ్వాలి. మాత్రలను చప్పరించడం లేదా నమిలి మింగడం చేయాలి. మధ్యాహ్న భోజనం తర్వాత చేతులు శుభ్రంగా కడుక్కున్న అనంతరం తీసుకోవాలి. మాత్రలు తీసుకున్న తర్వాత ఏ విధమైన ఇబ్బందులు ఎదురైనా వెంటనే దగ్గరలోని వైద్య సిబ్బందిని సంప్రదించాలి.

–జాన్‌లెవి, జిల్లా ప్రోగ్రామ్ అధికారి, రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం, అమలాపురం

విజయవంతం చేయాలి



జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. ఈ ఆల్బెండజోల్ మాత్రల పంపిణీకి అన్ని చర్యలు చేపట్టాం. ఈ నెల 17న మాత్రలు వేసుకోని వారు తప్పనిసరిగా ఈ నెల 25న మ్యాపింగ్ అఫ్ ప్రోగ్రామ్‌లో డీవార్మింగ్ మాత్రలు తీసుకోవాలి. 4–6 నెలల గర్భిణులు కూడా ఆల్బెండజోల్ మాత్రలను వేసుకోవాలి.

–డాక్టర్ దుర్గారావుదొర, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, అమలాపురం